వంద పడకల ఆస్పత్రి నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కామాటిపురలో 100 పడకల ఆస్పత్రి, చార్మినార్‌లో ప్రభుత్వ నిజామియా టీబీ కాలేజీ, నిజామియా జనరల్ ఆస్పత్రిలో పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులు, కొత్త బ్లాక్‌ల నిర్మాణం, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శానిటేషన్, టాయిలెట్స్ బ్లాక్స్, యాకుత్‌పురాలోని ఎస్ఆర్‌టీ కాలనీలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బండ్లగూడ ఏరియా ఆస్పత్రిలో 50 పడకల ఆస్పత్రి, డబీర్‌పుర ఏరియా ఆస్పత్రిలో 100 పడకలు, బార్కాస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అప్‌గ్రేడేషన్ పనులు, లాలాపేట్ 30పడకల అర్బన్ హెల్త్ కేర్ సెంటర్, అడ్డగుట్ట 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు, నల్లకుంట ఓపీడీ బ్లాక్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ బిల్డింగ్, ఎర్రమంజిల్ ఎంసీహెచ్‌లో 200 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ ఈఎన్టీ కోఠి హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, సీతాఫల్‌మండిలో 30 పడకల అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తదితర పనుల పురోగతిపై తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజనీర్లు, డీసీహెచ్ఎస్, డీఎంహెచ్ఓలతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ మొదలుకాని వాటికి వెంటనే టెండర్లను పిలవాలని, నిర్మాణం మొదలైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో టీఎంఎస్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్‌రెడ్డి, ఈఈ చలపతి రావు, డీఎంహెచ్ఓ వెంకట్, డీసీహెచ్ఎస్ సునీత, టీజీ ఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.నాయుడు, డీఈ పి. జగదీష్ ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జాతీయ గణాంక దినోత్సవం

ప్రశాంత చంద్ర మహలనోబిస్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహించారు.

వీసీల నియామకాల్లో బీసీలకు 50% కేటాయించాలి


సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలకు త్వరలో చేపట్టనున్న వైస్‌చాన్స్‌లర్‌ల నియామకాల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. యూనివర్సిటీలలో 2400 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టులలో కూడా 50 శాతం పదవులు బీసీలకు కోటా ఇవ్వాలని కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.అనంతయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జేఎన్‌టీయూ, పాలమూరు, ఉస్మానియా, శాతవాహన యూనివర్సిటీ వీసీ పోస్టులను బీసీలకు కేటాయించాలని, ఉన్నత విద్యామండలి చైర్మన్ పదవిలో కూడా బీసీనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, రాజేందర్, మల్లేష్‌యాదవ్, మోదీరాందేవ్ పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో కేన్సర్‌పై సదస్సు


బసవతారకం ఆస్పత్రిలో జరిగిన సదస్సులో వైద్యులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన కేన్సర్ వ్యాధులకు మంచి చికిత్స అందించే వీలు ఏర్పడిందని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ట్రస్టు బోర్డు సభ్యులు, రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయ పేర్కొన్నారు. శనివారం బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆడిటోరియంలో కేన్సర్‌పై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నోరి దత్తాత్రేయ, బసవతారకం ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కృష్ణయ్య మాట్లాడారు. సార్కోమా అనే ఎముకలు, మృదు కణజాలాలలో కొవ్వు, కండరాలు, రక్త నాళాలు, నరాలు, లోతైన చర్మ కణజాలాలు, పీచు కణజాలాలలో అభివృద్ధి చెందే అరుదైన కేన్సర్‌పై అవగాహన కలిగించడం, వ్యాధిని గుర్తించడం, ఎలాంటి చికిత్స అందించలనే అంశాలపై ఈ సదస్సులో నిపుణులు చర్చించారు. మెడికల్ డైరెక్టర్, డాక్టర్ టీఎస్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఫణికోటేశ్వరరావు, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్, చెన్నయ్‌కి చెందిన ప్రముఖ మస్కిలోస్కెలిటన్ అంకో సర్జన్ డాక్టర్ ఆనంద రాజాతో పాటూ వైద్యులు శ్రీనాథ్‌గుప్తా, డాక్టర్ సృజన్ శుక్లా వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు


దగ్గుపాటి సురేష్‌బాబుకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దుండిగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణీకరణ సంస్థ నుంచి ఐఎస్ఓ 2001, 2018 ప్రమాణపత్రం లభించింది. శనివారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్‌బాబు మాట్లాడుతూ పాఠ్యాంశాల రూపకల్పన, విద్యార్థులకు అనుకూలమైన విద్యాబోధనా పద్ధతులు, మంచి వనరులు, వసతుల కల్పన, ఆహ్లాదకరమైన వాతావరణం వంటివి విద్యా సంస్థలో ఉన్నందున ఈ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన అధ్యాపకులు ఆచార్య సీడీ నాయుడు, పరిపాలనా డీన్ ఆచార్య డాక్టర్ చెన్నకేశవరావు, సమన్వయ కర్త డాక్టర్ డీవీ చంద్రమోహన్‌రావు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్- ముఫ్త్ బిజిలీ యోజన పోర్టల్ సమస్యలు పరిష్కరించాలి'

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్- ముఫ్త్ బిజిలీ యోజన పథకం పోర్టల్‌లో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.అశోక్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.శ్రీహరిబాబు డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో శనివారం తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ పథకం కింద అపార్ట్‌మెంట్లు, సొసైటీలలో సోలార్ ఎనర్జీ స్థాపన కోసం ఉద్దేశించిన దరఖాస్తులను పోర్టల్ అంగీకరించడం లేదన్నారు. సాధారణంగా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు డిస్కంలకు చెందిన ఏడీఈల లాగిన్‌లోకి రావాలి కానీ, అలా జరగడం లేదన్నారు. పోర్టల్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం, డిస్కంలు ప్రత్యేక దృష్టిసారిస్తే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశముంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పరకాల రాజేష్, బాబునాయుడు పాల్గొన్నారు.

కల్కిని వీక్షించిన దర్శక, నిర్మాతలు

చిక్కడపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అమితాబ్‌బచ్చన్, దీపికా పడుకోన్, ప్రభాస్ నటించిన కల్కి సినిమాను ఆ సినిమా దర్శక, నిర్మాతలు వీక్షించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సుదర్శన్ 35ఎంఎం థియేటర్‌లో శుక్రవారం రాత్రి 10గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు మొత్తం సినిమాను సినిమా దర్శక నిర్మాతలు నాగ్‌అశ్విన్, స్వప్నదత్, ప్రేక్షకులతో కలిసి చూశారు. థియేటర్ మేనేజింగ్ పార్ట్‌నర్‌లు విశ్వంభర్, బాల్‌గోవింద్‌రాజు, మేనేజర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్ వారి వెంట ఉన్నారు.



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి హైదరాబాద్ నార్సింగ్ సర్వీస్ రోడ్డులోని జయభేరి టెంపుల్ వీధికి చెందిన మాగంటి సత్యనారాయణమూర్తి, మధురావు కుటుంబసభ్యులు శనివారం రూ.40 లక్షలకు పైగా విలువగల బంగారు తాపడంతో చేసిన ఆభరణాలను సమర్పించారు. నాగాభరణం, జటాఝూటం, నాగపడగ, పానమట్టం, ధారపాత్ర, మకర తోరణం తదితర ఆభరణాలను ఈవో కేఎస్ రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు.

- విజయవాడ(వన్‌టౌన్), జూన్ 29(ఆంధ్రజ్యోతి)

సీబీఎస్ఈ పేరుతో నిలువునా మోసం

- హస్తినాపురంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ నిర్వాకం
- అనుమతి లేకున్నా అడ్మిషన్లు
- యాజమాన్యం తీరుతో తల్లిదండ్రుల ఆందోళన
- డబ్బులు వాపస్ చేయాలని ఒత్తిడి


హస్తినాపురం జడ్‌పీరోడ్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చంపాపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలో చేర్పిస్తే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీబీఎస్ఈ సిలబస్‌తో బోధన ఉంటుందని ఆరునెలల నుంచి ఓ స్కూల్ యాజమాన్యం ప్రచారం చేసింది. పేరు కలిగిన విద్యాసంస్థ కావడంతో తల్లిదండ్రులు ఇతర పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లల ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీలు) తీసుకొచ్చి పోటీపడి అడ్మిషన్స్ చేయించారు. చివరికి పాఠశాలలో స్టేట్ సిలబస్ బోధనలను చూసి అయోమయంలో పడ్డారు. అనుమతిలేని సిలబస్‌లో చేర్పించి ఆగమయ్యామని ఆందోళనకు గురవుతున్నారు.

వివరాలిలా ఉన్నాయి. హస్తినాపురం డివిజన్‌లో శ్రీచైతన్య టెక్నో కరికులం స్కూల్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలలో 1 నుంచి 8 వరకు స్టేట్, సీబీఎస్ఈ సిల బస్‌లో బోధనలున్నాయని నిర్వాహకులు కొన్ని నెలలుగా విస్తృతంగా ప్రచారం చేశారు. దీనిని నమ్మిన తల్లిదండ్రులు వివిధ పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లల టీసీలను తీసుకొని హడావిడిగా సదరు టెక్నో స్కూల్‌లో చేర్పించారు. జూన్ రెండో వారం నుంచి వేలల్లో అడ్మిషన్ ఫీజులు, పాఠ్యపుస్తకాలు, సీబీఎస్ఈ పేరుతో తరగతుల వారీగా ఫీజులు దండుకున్నారు.

పాఠ్య పుస్తకాలు, డ్రెస్‌లు అన్నీ అక్కడే..

పాఠశాలలో చేర్పించిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి యాజమాన్యం ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. సీబీఎస్ఈ నర్సరీ అడ్మిషన్‌కు రూ.25-30వేలు, పాఠ్యపుస్తకాలకు రూ.10-25 వేలు, యూనిఫాంలు, పీటీ డ్రెస్‌లకు రూ.6వేలు, టై, బెల్టులకు రూ.400 వసూలు చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇన్ని చెల్లించినప్పటికీ.. చివరికి సీబీఎస్ఈ బోధనలు లేకపోవడంతో దిగులు చెందుతున్నారు. ఈ క్రమంలో తమ పిల్లలను స్టేట్ సిలబస్‌లో చదివించాలా. లేక ఇతర పాఠశాలల్లో చేర్పించాలా.. అనే డైలమాలో పడ్డారు. కొందరు తాము చెల్లించిన డబ్బులు ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరుతున్నా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీబీఎస్ఈ పర్మిషన్ లేకపోవడంతో పరేషాన్..!

గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న స్కూల్ తతంగం రెండు రోజుల క్రితం బయటపడింది. పాఠశాలలో సీబీఎస్ఈ బోధనకు బోర్డు నుంచి ఎలాంటి అనుమతి లేదని విద్యార్థి సంఘాల ద్వారా తెలియడంతో తల్లిదండ్రులు పరేషాన్ అవుతున్నారు. కొంతమంది పాఠశాలకు వెళ్లి ఆందోళన చేపడుతుండడంతో సిబ్బంది వారికి నచ్చజెప్పే పనిలోపడ్డారు. సీబీఎస్ఈ కోసం బోర్డుకు దరఖాస్తు చేశాం, త్వరలో అనుమతి వస్తుందని సర్ది చెబుతున్నారు. స్కూల్ యాజమాన్యం మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

పాఠశాల గోడలకు వాల్‌పోస్టర్..

పాఠశాల నిర్వాకంపై విద్యాశాఖ కమిషనర్, స్థానిక ఎంఈఓకు విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు పాఠశాలను శనివారం సందర్శించి అడ్మిషన్ల గదితో పాటు బుక్స్‌ను విక్రయిస్తున్న గదిని సీజ్ చేశారు. పాఠశాలకు సీబీఎస్ఈ అనుమతి లేదని, కేవలం స్టేట్ సిలబస్ బోధనకు మాత్రమే అనుమతి ఉన్నట్లు పాఠశాల గోడలకు పోస్టర్లు అంటించారు.


పాఠశాలలో విద్యాశాఖ అధికారులు సీజ్ చేసిన గది, సీబీఎస్ఈ అనుమతులు లేవని అంటించిన పోస్టర్

పిల్లల భవిష్యత్‌పై ఆందోళన

పాఠశాలలో సీబీఎస్ఈకి అనుమతి లేదని తెలిసి షాక్‌కు గురయ్యాం. పిల్లల భవిష్యత్‌పై తమకు ఆందోళనగా ఉంది. విద్యాశాఖ అధికారులు తగిన చొరవ తీసుకోవాలి. ఇప్పటికే వేలాది రూపాయలను పాఠశాలకు చెల్లించాం.

- మోహన్, విద్యార్థి తండ్రి, హస్తినాపురం

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

హస్తినాపురం డివిజన్‌లో ప్రభుత్వ అనుమతుల్లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న పాఠశాలలను సీజ్ చేయాలి.

- సుజాతనాయక్, కార్పొరేటర్, హస్తినాపురం

సీబీఎస్ఈ బోర్డుకు లేఖ రాస్తాం

హస్తినాపురం డివిజన్‌లోని శ్రీచైతన్య టెక్నో కరికులం స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్ బోధనలకు అనుమతి లేదని ఇటీవలే మాకు తెలిసింది. దీనిపై యాజమాన్యాన్ని విచారించి బోర్డుకు లేఖ రాస్తాం. అనుమతి లేకుండా నడిపిస్తే స్కూల్‌ను సీజ్ చేస్తాం.

-సుశీందర్‌రావు, రంగారెడ్డి, డీఈవో

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టండి : బీజేపీ


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

వనస్థలిపురం, జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని బీజేపీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కోరారు. వనస్థలిపురం పరిసర ప్రాంతాల్లోని ప్రైవేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విచ్చలవిడిగా ఫీజులు వసూల్ చేస్తున్నాయని ఆయన అన్నారు. అధిక ఫీజులు వసూల్ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని హయత్‌నగర్ ఎంఈవో హీర్యానాయక్‌కు శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులతోపాటు, పాఠ్యపుస్తకాలు కూడా తమ వద్ద కొనాలని పాఠశాలల నిర్వాహకులు బెదిరిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలోని కొన్ని పేరొందిన కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులు ముక్కుపిండి ఫీజులు వసూల్ చేస్తున్నాయన్నారు. ప్రతి పాఠశాలలలో పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోను కోరినట్టు ప్రభాకర్‌రెడ్డి చెప్పారు.

ఆయన వెంట బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, అంజన్‌కుమార్ గౌడ్, విజయ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలి: సబితారెడ్డి


గుర్రంగూడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

సరూర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తిచేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. కొన్నాళ్లుగా గుర్రంగూడ-అల్మాస్‌గూడ రహదారి విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పునఃప్రారంభించి పూర్తి చేయాలని అన్నారు. శనివారం 26వ డివిజన్‌లోని గడ్డం ఎన్‌క్లేవ్, అరవింద్‌నగర్, శ్రీకృష్ణానగర్, మారుతీనగర్, ఆదిత్యానగర్, గుర్రంగూడ-అల్మాస్‌గూడ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. అర్ధంతరంగా ఆగిపోయిన పలు రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.



బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని సప్తగిరి కాలనీలో గణేశ్ మండపాన్ని కూల్చివేసిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గణేశ్ మండపం కూల్చివేతకు నిరసనగా శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు, హిందూ సంఘాల ప్రతినిధులు ఆందోళన నిర్వహించారు. -సరూర్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)

వనస్థలిపురంలో చైన్‌స్నాచర్ అరెస్ట్

బంగారు గొలుసు, స్కూటీ స్వాధీనం

వనస్థలిపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నేరస్థుడిని వనస్థలిపురం పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి తులం బంగారం గొలుసు, మొబైల్, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 26న వనస్థలిపరం పరిధిలోని ఎస్‌కేనగర్‌లో రాత్రి 9 గంటల సమయంలో శ్రీలేఖ అనే మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన స్నాచర్ ఆమె మెడలోని గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా శ్రీలేఖ మెడలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది అతనే అని తేలింది. నేరస్థుడు ఇబ్రహీంపట్నంకు చెందిన పొలమోని శివకుమార్‌గా పోలీసులు నిర్ధారించారు. చైన్ స్నాచర్‌ను పట్టుకున్న వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ బృందాన్ని డీసీపీ అభినందించారు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

- మేనేజర్ అరెస్ట్

కొత్తపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని ఆదిత్యనగర్‌లోని ఓ హుక్కా సెంటర్ పై పోలీసులు దాడి చేసి మేనేజర్‌ను అరెస్ట్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి కథనం ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండా సాయిహర్ష రెసిడెన్సీ అపార్టుమెంట్ 5వ అంతస్తులో కోట సందీప్‌రెడ్డి అనే వ్యక్తి 'ఎల్‌ఓసీ కేఫ్- ఓపెన్ హుక్కా' సెంటర్ నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. శుక్రవారం రాత్రి సదరు హుక్కా సెంటర్‌పై దాడి చేశారు. సెంటర్ మేనేజర్ ఎర్రిబోయిన జయంత్(23)ను అరెస్టు చేసి 3 హుక్కా పాట్స్, 3 హుక్కా పైపులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు సందీప్‌రెడ్డి పరారీలో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: ఉప్పల శ్రీనివాస్ గుప్తా

కొత్తపేట, జూన్ 29(ఆంధ్ర జ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర మహిళా విభాగం అధ్వర్యంలో శనివారం కొత్తపేట శ్రీన్యకాపరమేశ్వరి ఆలయంలో అనుగ్రష్మి అనుఘాదేవి దత్తవ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ రైతు సోదరులు పాడిపంటలతో, సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ సెంట్రల్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, సినీ నటుడు పసునూరి శ్రీనివాస్, ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞశర్మ, అడిషనల్ డీజీపీ విజయకుమార్, వాసవి సేవాకేంద్రం అధ్యక్షుడు రమేష్ గుప్తా, మహిళలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: సోనాలీ భట్టాచార్య

వనస్థలిపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఎంతో ముఖ్యమని సహజ యోగ నేషనల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సోనాలి భట్టాచార్య అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన సహజయోగ మహోత్సవానికి సోనాలి భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ ఒక వ్యక్తిగత జీవనశక్తిని విశ్వంతో అనుసంధానం చేయడానికి ఉపయోగపడే సాధనమన్నారు. ఆందోళన, అభద్రతా భావము, కుంగుబాటు వంటి సమస్యలకు యోగ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చొన్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆర్డినేటర్లు మల్లారెడ్డి, రామ్మోహన్‌రావు, సుబ్బిరెడ్డి, సుప్రజ, వినోద్, ప్రమోద్, సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అమల్లోకి కొత్తచట్టాలు

- వేగంగా కేసుల దర్యాప్తు ● నూతన నేర న్యాయ చట్టాలపై అవగాహన కల్పించిన రాచకొండ సీపీ


మాట్లాడుతున్న సీపీ తరుణ్‌జోషి

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జూలై 1 నుంచి భారత ప్రభుత్వ నూతన నేరన్యాయ చట్టాలు-2023 అమలులోకి రానున్నట్లు రాచకొండ సీపీ తరుణ్‌జోషి పేర్కొన్నారు. ఈ చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వర న్యాయం లభిస్తాయన్నారు. నూతన చట్టాలపై శనివారం ఘట్ కేసర్‌లోని విజ్ఞాన భారతి కళాశాలలో పోలీస్ అధికారులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ తరుణ్‌జోషి, న్యాయ నిపుణులు, హైకోర్టు అడ్వకేట్ సురేష్ పాల్గొని నూతన చట్టాల నిర్వహణతోపాటు.. విచారణలో పాటించవలసిన నూతన విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ.. అమల్లోకి రానున్న కొత్త చట్టాలు మనదేశ అంతర్గత భద్రతలో నూతన శకాన్ని ప్రారంభించనున్నాయని పేర్కొన్నారు. ఈ నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతులలో మార్పు వస్తుందని, ప్రజలకి మరింత సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. భారత్ స్వతంత్రదేశంగా మారిన తర్వాత కూడా వలస పాలన నాటి న్యాయచట్టాల ప్రకారమే నేరన్యాయ వ్యవస్థ, శాంతి భద్రతల పరిరక్షణ వ్యవస్థ నిర్వహించడం జరుగుతోందని సీపీ గుర్తు చేశారు. ఇన్నేళ్లలో భారత న్యాయ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని, అవసరాన్ని బట్టి ప్రజాభద్రత కోసం ఎన్నో చట్టాల రూపకల్పన జరిగిందని పేర్కొన్నారు. ఇప్పుడు అమలులోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం మనదేశ శాంతిభద్రతల పరిరక్షణలో ఒక మైలురాయి అని తెలిపారు.


రోడ్డుపై మురుగు నీటిని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శేఖర్

కాలనీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

సరూర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాలనీల్లోని డ్రైనేజల సమస్యల పరిష్కారినికి కృషి చేస్తామని బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ లక్ష్మారెడ్డి కాలనీలో పర్యటించిన ఆయన, కాలనీలలోని మురుగు సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ స్థానికంగా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ వినీల్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాలనీవాసులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

- డీసీ తిప్పర్తి యాదయ్య

వనస్థలిపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా వాటర్ స్టాగ్నేషన్ లేకుండా చర్యలు తీసుకోవాలనీ హయత్‌నగర్ సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రానున్న బోనాల పండుగ సందర్భంగా ప్రతి ఆలయం వద్ద లైటింగ్ ఏర్పాట్లు, శానిటేషన్, గుంతల రోడ్లకు మరమ్మతులు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్లు కోరారు. కాలనీల్లో దోమలను నివారణకు ఫాగింగ్ చేపట్టాలని కోరారు. ఆయా పనులను వెంటనే పూర్తిచేయాలని కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, అరుణ, నర్సింహరెడ్డి, నవజీవన్‌రెడ్డి, పలు శాఖల అధికారులు ఈఈ రమేష్ బాబు, పావనీ, లావణ్య, యాదగిరి, బలరాం, దామోదర్‌రావు, రాకేష్, చంద్రశేఖర్ రెడ్డి, నరేంద్ర తేజ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

హయత్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో రైతు భరోసా కార్యక్రమంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రైతుల నుంచి సూచనలు, సలహాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు చేసిన సూచనలు, సలహాలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రైతుల శ్రేయస్సుకోసం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని సత్తయ్య అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ధాత్రిదేవి, వైస్‌చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరక్టర్లు లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, యాదగిరి, ఎస్.లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సీహెచ్ లక్ష్మమ్మ, సెక్రెటరీ రాందాసు, మాజీ సర్పంచ్ కె. లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వనస్థలిపురం డివిజన్ అభివృద్ధే లక్ష్యం

- కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

వనస్థలిపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ అభివృద్ధి లక్ష్యమని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం రాజిరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమావేశంలో వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సోమనాథ క్షేత్రం గుట్ట నుంచి వచ్చే వరదనీరుతోనే కాలనీలకు వరదనీరు వస్తుందన్నారు. డెల్టా ఆస్పత్రి నుంచి ఉన్న నాలాను ఓపెన్ చేసి వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడుతామని, నాగార్జున కాలనీ నుంచి వచ్చే వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టామన్నారు. గుంటి జంగయ్యనగర్ కాలనీలో రూ. 50 లక్షలతో అండర్ పాస్ పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కాలనీల అధ్యక్షులు హరిందర్‌రెడ్డి, యాదవరెడ్డి, నవీన్ కుమార్, కృష్ణమూర్తి, రమేష్‌రెడ్డి, కృష్ణయ్య, యుగేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట డివిజన్‌ను అభివృద్ధి చేస్తా

- కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట నల్ల, ఎర్ర పోచమ్మ ఆలయం, నిర్మలానగర్ కాలనీలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం, కర్మన్‌ఘాట్‌లో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లను కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కాలనీలు, బస్తీలలో యూజీడీ, రహదారుల నిర్మాణ పనులు విరివిగా చేపడుతున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ విద్యుత్ ఏఈ జగన్నాథ్, సూపర్‌వైజర్స్ హన్మంత్, భిక్షం, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కాలనీల ప్రతినిధులు దాసరి కృష్ణారెడ్డి, సామ శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సామ తిరుపతిరెడ్డి, సుశీల్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్‌గుప్తా, రాంరెడ్డి, అల్వాల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి ధనంజయగుప్తా, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు నిధులు మంజూరు చేయండి

- హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌కు కార్పొరేటర్ దర్పల్లి వినతి

వనస్థలిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ రింగ్‌రోడ్డు నుంచి సరూర్‌నగర్ చెరువు వరకు 1000 ఎంఎం డయామీటర్ పైపులైన్‌కు నిధులు మంజూరు చెయాలని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు హెచ్‌ఎండీఏ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. లింగోజిగూడ డివిజన్‌లోని బ్యాంక్ కాలనీ, నవోదయ కాలనీ, శాతావాహన కాలనీ, కాకతీయ కాలనీ, మైత్రినగర్, సౌభాగ్యనగర్ తదితర కాలనీలకు ముంపు సమస్యలు తొలగిపోవాలంటే 1000 డయా మీటర్ పైపులైన్ వేయడంతో ఎలాంటి ముంపు సమస్యలు ఏర్పడవన్నారు.

జలమండలి జనరల్ మేనేజర్

ఎస్ఎస్. రహమాన్‌కు సన్మానం



అల్వాల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జలమండలి జనరల్ మేనేజర్ ఎస్ఎస్ రహమాన్ పదవీ విరమణ పొందారు. శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసిన జలమండలికి చెందిన ఉద్యోగులు ఆయనకు పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయన భార్య ఎస్.వీ లక్ష్మి, కమారుడు వికాస్, కోడలు టీనాజ్, అల్లుడు హేమంత్, కుమార్తె ప్రియ, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786